క్లుప్తంగా

సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించాలి



బొమ్మలను పరిశీలిస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్

నంద్యాల(న్యూటౌన్): సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని రామకృష్ణ డిగ్రీ కళాశాల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో 11 రోజులుగా జరుగుతున్న ఏక్ భారత్, శ్రేష్ట భారత్ జాతీయ స్థాయి ఎన్‌సీసీ క్యాంప్‌లో భాగంగా బుట్టబొమ్మలు, బొమ్మల కొలువు ఎగ్జిబిషన్ నిర్వహించారు. బిహార్, జార్ఖండ్ నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్స్ కొండపల్లి, ఏటికొప్పాక, ధర్మవరం ప్రాంతాల నుంచి సేకరించిన పురాతన సంప్రదాయ బొమ్మల కొలువును తిలకించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి, జోబీఫిలిప్, ప్రియ పాల్గొన్నారు.

వృద్ధుడికి వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్‌ను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పక్షవాతంతో మంచానికే పరిమితమైన రామయ్య అనే వృద్ధుడికి చక్రాల కుర్చీ అవసరమని తెలపడంతో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు లక్ష్మయ్య, గురుస్వామిలు చక్రాల కుర్చీని బుధవారం అందజేశారు. సంఘం అధ్యక్షుడు రమణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో నిరుపేద దివ్యాంగులకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం రీజియన్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, నాయకులు సోమేసుల నాగరాజు, వెంకటరావు, శివరామిరెడ్డి, శ్రీనివాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి



ముత్తలూరులో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి భాగ్యలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని ముత్తలూరు, చిత్రేనిపల్లె గ్రామాల్లో బుధవారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి

ఉయ్యాలవాడ: ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి సూచించారు. బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ఉయ్యాలవాడలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులు జీవన ఉత్పత్తి అయిన కషయాలను అందుబాటులో ఉంచుకొని ప్రకృతి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడటం ద్వారా భూమి సారం కోల్పోవడంతో పాటు దిగుబడులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు సునీత, రాణెమ్మ, వీఏఏలు పాల్గొన్నారు.

భాషోపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

నంద్యాల(న్యూటౌన్): భాషోపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తామని నంద్యాల జిల్లా అధ్యక్షుడు కన్నయ్య అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన భాషోపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన భాషోపాధ్యాయులను అభినందించడం సంతోషకరమన్నారు. అనంతరం నంద్యాల జిల్లా ఉప విద్యాశాఖ అధికారి డీటీ శంకర్ ప్రసాద్, మాట్లాడుతూ భాషోపాధ్యాయులు పాఠశాల సహాయకులుగా పదోన్నతి పొందడంతో పాటు ప్రధానోపాధ్యాయులుగా, మండల విద్యాశాఖ అధికారులుగా పదోన్నతి పొందడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రామసుబ్బయ్య, ముత్తోజ్ వీరబ్రహ్మం, షరీఫ్, అన్నెం శ్రీనివాసరెడ్డి, మార్గరేట్, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాత్యాయని అలంకారంలో శ్రీకాళికాంబదేవి



బాలాజీ కల్యాణ మండపంలో మంగళగౌరీగా..



మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకారంలో శ్రీకామేశ్వరిదేవి



సంజీవనగర్ రామాలయంలో మహిషాసురమర్దిని అలంకారంలో కాశీవిశాలాక్షి

మహిషాసురమర్దిని పాహిమాం.. పాహిమాం!









ఇంజేడులో మహిషాసురమర్దినిగా చౌడేశ్వరీదేవి ,దొర్నిపాడులో దుర్గాదేవిగా.. ,ముత్యాలపాడులో శ్రీధనలక్ష్మిదేవిగా..రుద్రవరంలో వాసవీ దేవిగా

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని బుధవారం పలు దేవాలయాల్లో ఉదయం నుంచి గణపతిపూజలు, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, అంకురారోహణ, నవగ్రహ పూజలు, రాహుః కాల పూజలు, కంకణ దారణలు, స్వామి, అమ్మివార్లకు విశేష పూజలు, పూలంగిసేవ కార్యక్రమాలు, లలితా సహస్రనామా లు, వేదపారాయణాలు, సామూహిక కుంకుమార్చనలు, చండీ హోమాలు నిర్వహించి సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహించారు. అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.



జగజ్జననీ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు



బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో మహిషాసురమర్దిని, శ్రీసిద్ధిదాత్రిగా అమ్మవార్లు

వీరారెడ్డిపల్లెలో బతుకమ్మ ఆట





బతుకమ్మ ఆడుతున్న మహిళలు

శిరివెళ్ల: దేవీ శరన్నవరాత్రులలో భాగంగా వీరారెడ్డిపల్లెలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా బతుకమ్మ ఆటపాటలు జరగడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే బుధవారం మహిళలు, యువతులు ఆలయం వద్ద బతుకమ్మ ఆడారు. వేడుకలలో గ్రామస్తులు పాల్గొని తిలకించారు

సూపర్ జీఎస్‌టీపై అవగాహన ర్యాలీ



తగ్గిన జీఎస్‌టీ బ్యానర్లను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల: కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల కోసం 'సూపర్ జీఎస్‌టీ– సూపర్ సేవింగ్స్' అవగాహన కార్యక్రమాన్ని బుధవారం జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతుల పంట ఉత్పత్తి ఖర్చులు తగ్గి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరింత చేరువ కావడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ట్రాక్టర్, ట్రాక్టర్ పరికరాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, బయో పెస్టిసైడ్స్, స్ప్రింక్లర్, డ్రిప్ పరికరాలు, డీజిల్ ఇంజిన్లపై జీఎస్‌టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించిందన్నారు. రైతులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని లాభపడాలని పిలుపునిచ్చారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ప్రారంభించిన అవగాహన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధులలో సాగింది. జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగరాజు, మండల వ్యవసాయ అధికారి నంద్యాల ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దెల పరిశీలన

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు, గొడిగనూరు గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన మట్టి మిద్దెలను నంద్యాల జిల్లా హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్, ఆళ్లగడ్డ డివిజన్ డీఈ విజయ్‌బాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వాటిని త్వరలో పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో వారి వెంట హౌసింగ్ ఎఈ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఓబులేసు, సుబ్బరామయ్య, సలీం తదితరులున్నారు.

కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామంలోని 0.06 సెంట్ల స్థలంలో ఉన్న తాత్కాలిక షెడ్డు వివాదం కోర్టు పరిధిలో ఉంది. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా, తొలగించకుండా ఆళ్లగడ్డ కోర్టు వారు ఇంజెక్షన్ ఆర్డరు ఇచ్చి ఉన్నారు. అయితే కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి డిప్యూటీ ఎంపీడీఓ తాహెర్ హుసేన్ స్థలంలో ఉన్న తాత్కాలిక షెడ్డును తొలగించారని బాధితుడు నేరెళ్ల దాసు ఆరోపించారు. ఈ స్థలం తన తల్లి నుంచి దానంగా సంక్రమించిదని, వైఎస్సార్ జిల్లా, ప్రొద్దుటూరుకు చెందిన గాబ్రిల్ ఈ స్థలం తనదని తన కుటుంబ సభ్యులపైన దాడి చేయడంతో అతనిపై చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. దీంతో అతనిపై 2023 సంవత్సరంలో కేసు నమోదై కోర్టులో కొనసాగుతుందని చెప్పారు. అయితే డూప్లికెట్ పట్టా పుట్టించి పీజీఆర్ఎస్‌లో నంద్యాల జిల్లా కలెక్టర్‌కు నెరెళ్ల గాబ్రియల్ ఫిర్యాదు చేయగా.. స్థానిక అధికారులు తాత్కాలిక షెడ్డును అన్యాయంగా తొలగించారని బాధితుడు నెరెళ్ల దాసు వాపోయాడు. తమకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నాడు.

కలెక్టర్ ఆదేశాల మేరకే షెడ్డును తీయించాం

పీజీఆర్ఎస్‌లో గాబ్రియల్ కలెక్టరు ఫిర్యాదు చేయగా, సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించడంతో చింతల చెరువు గ్రామంలోని గాబ్రియల్ స్థలంలో ఉన్న చిన్న రేకుల షెడ్డును దాసు కుటుంబ సభ్యులచే తొలగించడం జరిగిందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తాహెర్ హుస్సేన్ వివరించారు.

జీఓ నం.5ను రద్దు చేసేంత వరకు పోరాటం

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల కూటమి ప్రభుత్వం బలిజలకు వ్యతిరేకంగా జారీ చేసిన జీఓ నం.5ను రద్దు చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని బలిజ సంఘం నాయకులు శెట్టి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ప్రథమనందీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బలిజ సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం బలిజ వర్గాల వారిని సంప్రదించకుండా జీఓ విడుదల చేయడంజరిగిందని , బలిజ కులస్తులు జీవోనం.5 వల్ల అన్ని విధాలుగా నష్టపోతామన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి జేసీ విష్ణు చరణ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గురుమూర్తి, చంద్రబాబు, వెంకటేష్,పడకండ్ల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గోస్పాడు: వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. బుధవారం అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రో గ్రాం అధికారులు, కార్యాలయం సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాల వయసు పైబడిన పురుషులు, మహిళలు పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటారని తెలిపారు. మానసిక ఆందోళనలకు గురవుతుంటారన్నారు. వృద్ధులకు కుటుంబ సభ్యు లు అండగా ఉండాలన్నారు. వారితో రోజు మాట్లాడటం, వారి అవసరాలు గురించి విచారించి తీర్చ డం వలన వారు సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.

నూతన ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలో ఇటీవల ఉపాధ్యాయులు, పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారిని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు నగేష్, రమేష్, ఇమాం హుసేన్, కరీష్మా, మౌనిక, ధరణి, కానిస్టేబుళ్లు అమీర్‌బాషా, మహబూబ్‌సుభాన్, సురేష్‌లను సింగిల్ విండో ప్రెసిడెంట్ సత్యనారాయణ, సిద్ది నారాయణ, శ్రీపతి ప్రసాద్, సంజీవ, మల్లికార్జున, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, రామారావులు ఘనంగా సత్కరించి అభినందించారు.

పింఛన్ల పంపిణీ తనిఖీ

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో బుధవారం పింఛన్ల పంపిణీ సాగింది. మండల కేంద్రమైన రుద్రవరం, ఆర్.నాగులవరం, నర్సాపురం గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తనిఖీ చేశారు. పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి పంపిణీ చేయాలని, ఎక్కడ బడితే అక్కడ ఇవ్వ వద్దని పంపిణీ దారులకు సూచించారు. నర్సాపురంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఎంపీడీఓ చేతుల మీదుగా పలువురు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కిరణ్ ఉన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన బొగ్గు లారీ

దొర్నిపాడు: మండల కేంద్రమైన దొర్నిపాడు శివారులో బుధవారం పంట కాల్వలోకి బొగ్గు లారీ దూసుకెళ్లింది. చెన్నై నుంచి దొర్నిపాడు మీదుగా బనగానపల్లె వైపు వెళ్తున్న బొగ్గు లారీ అదుపు తప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. అనంతరం క్రేన్ ద్వారా లారీని ఓ వైపుకు తప్పించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూశారు.

ఆటో డ్రైవర్ సేవ పథకానికి 286 మంది ఎంపిక

గోస్పాడు: ఆటో డ్రైవర్ సేవలు పథకంకి సంబంధించి మండలంలో 286 మంది ఎంపికైనట్లు ఎంపీడీవో అవమానుల్లా తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకానికి 306 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 286 మంది ఎంపిక అయ్యారని తెలిపారు. 20 మంది ఎంపిక కాలేదన్నారు.

జిల్లాకు 5,32,570 స్మార్ట్ కార్డులు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాకు 5,32,570 క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులు మంజూరు అయ్యాయని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది ద్వారా సంబంధిత కార్డు దారులకు పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. స్థానిక ఎన్‌టీఆర్ షాదీఖానాలో బుధవారం స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరై కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ విశ్వనాథ్, డీఎస్‌ఓ రవిబాబు, కమిషనర్ శేషన్న, తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా మాధవీలత



డిపో మేనేజర్‌కు బొకేను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జక్కుల మాధవీలత బుధవారం బాధ్యతలు చేపట్టారు. డీఎం పోస్టు మూడు నెలలుగా ఖాళీగా ఉండి, ఇన్‌చార్జ్ మేనేజర్‌లతో కొనసాగింది. కొత్త మేనేజర్ రావడంతో అధికారులు, సిబ్బంది పూలబొకెలు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ కిషోర్, సుబ్బరాజు, యోగా రెడ్డి, నాగేశ్వరరెడ్డి, మల్లారెడ్డి, చెవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నాసుపత్రిలో వైద్యులను నియమించాలి

నంద్యాల(అర్బన్): పట్టణంలోని బైర్మల్‌వీధిలో వందేళ్ల క్రితం ఏర్పాటైన చిన్నాసుపత్రిలో వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని భారతీయ కిసాన్ మోర్చ నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షులు తూము శివారెడ్డి అన్నారు. ఆసుపత్రిలో వైద్యులను నియమించాలని కోరుతూ బుధవారం ఎంపీ బైరెడ్డి శబరికి వినతి పత్రం ఇచ్చారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది లేక రోగులు దూరాన ఉన్న ఇతర ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారన్నారు. డాక్టర్‌తో పాటు సిబ్బందిని నియమించాలన్నారు.

అటవీ సంరక్షణకు సహకరించాలి



శ్రీరంగాపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

రుద్రవరం: అటవీ సంరక్షణకు ప్రజలందరు సహకరించాలని చెలిమ రేంజి పెద్దకంబలూరు సెక్షన్ అధికారి కిషోర్ కుమార్ కోరారు. మండల పరిధిలోని పెద్దకంబలూరు, ఎల్లావత్తుల, టీ కొట్టాల, డీ కొట్టాల, శ్రీరంగాపురం, కోటకొండ తదితర గ్రామాల్లో బుధవారం చెలిమ రేంజి అటవీ ఉద్యోగులు అటవీ చట్టాలు, హెచ్చరిక పోస్టర్లను అతికించారు. అలాగే ఆయా గ్రామాల్లో ప్రజలకు అటవీ సంరక్షణపై అవగాహన కల్పించారు. సెక్షన్ అధికారి మాట్లాడుతూ అడవి అంతర్భాగంలో ఉన్న వృక్ష సంపదను నేల కూల్చి అక్రమంగా తరలించడం, వన్య ప్రాణులను వేటాడటం వంటివి చేస్తే అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు రామారావు, నాగప్ప తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించడం తగదు



మాట్లాడుతున్న ఎస్టీటీఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమాన్ని విస్మరించడం కూటమి ప్రభుత్వానికి తగదని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధాకర్, కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన విధంగా ప్రభుత్వం మధ్యంతర భృతి, పీఆర్సీ బకాయిలు, డీఏలు, విడుదల చేయక పోవడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశతో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం మెమో 57ను అమలు పరుస్తూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. 12వ వేతన సంఘాన్ని నియమించి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, సంపాదిత సెలవు బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధరణి ఉపేంద్రుడు, సంయుక్త కార్యదర్శి మతృనాయక్, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా గౌరవాధ్యక్షులు కేషాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. బుధవారం డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభా వంతుల వయో వృద్ధుల సహాయ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం చైర్మన్ చేతుల మీదుగా దివ్యాంగులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జహీరుద్దీన్, నారాయణ, వహిదా, ఎల్లయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు 35 గ్రామాల ఎంపిక

నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆంధ్ర ప్రదేశ్ – రీ సర్వే ప్రాజెక్ట్'లో మూడవ ఫేస్‌లో నంద్యాల జిల్లాలో 35 గ్రామాలు ఎంపిక అయ్యాయని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ బుధవారం తెలిపారు. రీ సర్వేలో భాగంగా ఈ నెల 3వ తేదీ నుంచి ఎంపిక చేయబడ్డ గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఈ సందర్భంగా సంబంధిత రైతులందరికీ నోటీసులు అందజేసినట్లు తెలిపారు. సంబంధిత గ్రామాల రైతులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లు, ఫొటోలు మరియు ఇతర సాంకేతిక వివరాలను సర్వే బృందానికి అందించాలని సూచించారు.